
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 24.0
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 21 ఆగస్టు 2024




మిడ్జిల్‌మండలం మున్ననూర్ శివారులో పారుతున్న దుందుభీ వాగు


గద్వాల పట్టణం దేవేందర్‌నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు


అయిజలో కర్నూల్-రాయిచూర్ రోడ్డుపై పారుతున్న వరద నీరు


కోయిలకొండలో నేలవాలిన జొన్న పంట


నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ వద్ద వరద నీటిలో మునిగిన వరి పంట

వర్ష బీభత్సం

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వాన » పొంగి పొర్లిన వాగులు, వంకలు » చెరువుల్లోకి నీరు » నీట మునిగిన పంటలు..
» జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పలు గ్రామాలకు తెగిన సంబంధాలు » వరదతో రోడ్లపై నిలిచిన రాకపోకలు
» ఉండవల్లిలో కాలిపోయిన ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు » నారాయణపేట జిల్లా మద్దూరులో 136 మి.మీ. వాన
» వనపర్తి జిల్లాలో కూలిన రెండు ఇళ్లు » పలు చోట్ల పాఠశాలలకు సెలవు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం బీభత్సం సృష్టించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుండపోత వానతో భారీ నష్టం సంభవించింది. అన్ని జిల్లాల్లో పంటలు నీట మునిగాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో వాగులు పొంగి పొర్లడంతో పలు గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ఉండవల్లి మండలం అనసూయమ్మ కాలనీ చుట్టూ నీరు చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్నది. అయిజ, మానవపాడు మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. ఈ సీజన్‌లో కురిసిన ఈ భారీ వానకు వాగులు నిండగా.. చెరువుల్లోకి నీరు చేరింది. పలు చోట్ల ఆరుతడి, వరి పంటలకు మేలు చేకూర్చింది.

మహబూబ్‌నగర్/కోయిలకొండ /జడ్చర్ల/ మిడ్జిల్/భూత్పూర్/గట్టు/ఉండవల్లి/అలంపూర్ చౌరస్తా/గద్వాల న్యూ టౌన్/ధరూరు/కేటిదొడ్డి/కొత్తపల్లి, ఆగస్టు 20: మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అడ్డాకుల, కోయిలకొండ, భూత్పూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. అడ్డాకులలో అత్యధికంగా ఆరు నుంచి ఏడు సెంటీ మీటర్ల వర్షం పడటంతో చెరువులు, కుంటలకు నీరు చేరి జలకళను సంతరించుకుంటున్నాయి. కోయిలకొండలో ఐదు సెంటీ మీటర్లకుపైగా వర్షం కురిసింది. ఈ మండలంలో జొన్న పంట నేలకొరిగింది. భూత్పూర్‌లోనూ ఐదు సెంటీ మీటర్ల వర్షం పడటంతో చెక్‌డ్యామ్‌లకు, కుంటలకు నీరు చేరుతోంది. పలు మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 28.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిడ్జిల్ మండలంలో దుందుభీ వాగు సన్నగా పారుతోంది. వర్షంతో వరి సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. భారీ వర్షం కురుస్తుండటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం తీవ్రత, పాఠశాలల పరిస్థితిని బట్టి సెలవులు ప్రకటించుకోవచ్చని ఎంఈఓలు, హెచ్‌ఎంలకు డీఈవో నుంచి వచ్చిన సందేశంతో మహబూబ్‌నగర్, జడ్చర్లలోని పలు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశాలు ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని అడ్డాకులలో 66.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోయిలకొండలో 54.8, భూత్పూర్‌లో 50.9, మహ్మదాబాద్, 37.9, మిడ్జిల్ 36, బాలానగర్ 30.9, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 30.7, మూసాపేట 28లో, జడ్చర్ల 25.2, సీసీకుంటలో 19.8, దేవరకద్రలో 19, రాజాపూర్‌లో 18 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 28.5 మిల్లీ మీటర్లు పడింది.


నాగర్‌కర్నూల్ జిల్లా ఐతోల్ వద్ద నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వాన నీరు


జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం అనసూయమ్మ కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పోతులమడుగు శివారులో అలుగు పారుతున్న చెక్‌డ్యాం

జడ్చర్లలో రహదారిపై నిలిచిన నీరు

జడ్చర్లలో గంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో 29.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలోని వెంకటరమణ టాకీస్ వద్ద ప్రధాన రహదారిపై సుమారు రెండు ఫీట్ల మేర వర్షం నీరు నిలిచింది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పాదచారులు అష్టకష్టాలు పడ్డారు. రోడ్డుపై నీరు నిలిచి తమ షాపుల్లోకి వస్తోందని, నీరు నిలువకుండా చూడాలని దుకాణదారులు డిమాండ్ చేస్తున్నారు. గంగాపురం రోడ్డులోని ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోకి వర్షపు నీరు చేరింది. దాంతో రోగులు అవస్థలు పడ్డారు. వర్షపు నీరు నిలవడంతో దుర్వాసన వస్తోందని వాపోయారు. మునిసిపాలిటీలోని ఊరకుంట నీరు బయటికి వెళ్లిపోయింది. ఏరియా ఆస్పత్రి ప్రాంగణాన్ని, ఊరకుంట ప్రాంతాన్ని జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈ, ఏఈలు పరిశీలించారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురవడంతో పట్టణంలోని కొన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

కేఎల్ఐ యూటీ కాల్వకు గండి

మిడ్జిల్ మండలంలో దుందుభీ వాగు పారింది. చిలువేరు గ్రామ శివారులోని మాసమ్మ చెరువు వద్ద కేఎల్ఐ కాల్వపై ఏర్పాటు చేసిన యూటీ కాల్వకు గండి పడింది. వాన నీరు కేఎల్ఐ కాల్వలోకి వెళ్తుండటంతో కాల్వకు ప్రమాదమని రైతులు అంటున్నారు.

చెరువుల్లోకి నీరు

భూత్పూర్ మండలంలో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. వాగుల్లోని చెక్‌డ్యాములు అలుగు పారాయి. వెల్కిచర్ల, భట్టుపల్లి, మద్దిగట్ల, కొత్తమొల్గర, శేరిపల్లి, పోతులమడుగు తదితర గ్రామాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలో 72 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న పంటలు

జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షంతో భారీ నష్టం వాటిల్లింది. వాగులు, వంకలు పొంగి పొర్లగా.. వర్తి, పత్తి పంటలు నీట మునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోయలగూడెం, ఇందువాసి తదితర గ్రామాల వాగులు ఉధృతంగా పారడంతో పొలాలు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. బోయలగూడెం పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో రైతులు వాగు దాటి అవతలికి వెళ్లలేకపోయారు. గ్రామానికి చెందిన రైతులు మూకన్న, అబ్రహం సీడుపత్తి పంట పూర్తిగా నీట మునిగింది. డ్రిప్ పైపులు కూడా నీటి ఉధృతికి కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉండవల్లి మండలంలోని ఉండవల్లి, చిన్న ఆముదాలపాడు, మారమునగాల, ప్రాగటూరు సమీపంలోని వాగులు పొంగిపొర్లాయి. అనసూయమ్మ కాలనీ చుట్టూ వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. కాలనీ వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఉండవల్లిలో పిడుగు పడి వేప చెట్టు విరిగిపోయింది. ఉరుములు, మెరుపులతో పలు ఇళ్లలో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాయి. మండలంలో దాదాపు 80.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మానవపాడు మండల కేంద్రానికి, అమరవాయి గ్రామానికి మధ్య ఉన్న వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు వద్ద ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. ఎంపీడీవో భాస్కర్ వరద ఉధృతిని పరిశీలించారు. గ్రామ శివారులోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో మెన్నిపాడు గ్రామానికి బాహ్య ప్రపంచంతో ఎనిమిది గంటల పాటు సంబంధాలు తెగిపోయాయి. అక్కడక్కడ పత్తి, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షానికి అలంపూర్, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల మండలాల్లో పొగాకు నాటుకు రైతులు సిద్ధమయ్యారు. గద్వాల జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వెనుకభాగంలో కొత్తగా ఏర్పడిన దేవేందర్‌నగర్ కాలనీలోకి వర్షం నీరు చేరింది. ఇళ్లలోకి నీరు రావడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. ధరూరు, కేటీదొడ్డి మండలాల్లో పంటలు నీట మునిగాయి. రోడ్లపై నీరు నిలిచింది. ధరూరు, కేటిదొడ్డి మండలాల్లో రెండు మూడు రోజుల కిందట వేసిన రోడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి. ధరూరు మండల కేంద్రంతో పాటు బూరెడ్డిపల్లి వాగులు నిండాయి. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో నిడ్జింత, భూనీడు, ఎక్మేడ్, దుప్పటిగట్టు గ్రామాల్లో వర్షం పడింది. వాగులు పారాయి. జిల్లాలో అత్యధికంగా మద్దూరులో 136, అత్యల్పంగా కృష్ణలో 20 మిల్లీ మీటర్లు మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నర్వలో 109, నారాయణపేటలో 82, మాగనూరులో 80, మక్తల్‌లో 30.2, దామరగిద్దలో 49.6, ధన్వాడలో 42.4, కోస్గిలో 38.8, ఊట్కూరులో 39.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.


సోమశిల శివారులో నేలవాలిన మొక్కజొన్న పంట

అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిన రాకపోకలు

వడ్డేపల్లి: వడ్డేపల్లి మండలం జూలకల్ వాగు పోటెత్తడంతో అంతర్రాష్ట్ర రహదారిపై నీరు నిలిచి, రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కోయిలదిన్నె, కలుకుంట్ల, పైపాడు, మద్దూరు, కొంకల గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లాయి. పొలాల్లోకి స్వల్పంగా నీరు చేరింది. శాంతినగర్-అయిజ మధ్య ఉన్న జూలకల్ వాగుపై బ్రిడ్జి నిర్మించి, వర్షకాలంలో ఇబ్బందులు రాకుండా రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలో 54 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

జలదిగ్బంధంలో గ్రామాలు

అయిజ: భారీ వర్షంతో అయిజ మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అయిజ, మండల పరిధిలోని ఉత్తనూరు గ్రామ శివారులో ఉన్న వాగు పొంగిపొర్లడంతో ఆయా గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. భూంపూర్, టీటీ దొడ్డి, సింధనూరు గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంత్రాలయం వంతెన పూర్తి కాకపోవడంతో రోడ్డుపై వాగులు, వంకల నీరు ప్రవహించి, రాకపోకలు ఆగిపోయాయి.

కూలిన ఇళ్లు

వనపర్తి అర్బన్: వనపర్తి జిల్లాలో వర్షానికి రెండు ఇండ్లు కూలిపోయాయి. ఘణపూర్, శ్రీరంగాపూర్ మండలాల్లో పంట కాలువలు తెగిపోయాయి. ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడలో మైబు ఇల్లు, అమరచింతలో మరో ఇల్లు కూలిపోయింది. కమలొద్దిన్‌పూర్‌లో కాలువ తెగి, పంట పొలాల్లోకి నీరు చేరింది. శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో చెరువు కాలువలు పూడిక తీయకపోవడంతో అవి నిండి పారి, పొలాలు నీట మునిగాయి. మండలంలోని వెంకటాపురం దగ్గర బ్రిడ్జి తెగి రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో అత్యధికంగా శ్రీరంగాపూర్ మండలంలో 81.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కొత్తకోట, పెబ్బేరులో 80.3, వనపర్తిలో 68.1, చిన్నంబావిలో 64.5, అమరచింతలో 62.7, గోపాల్‌పేటలో 57.3, మదనాపూర్‌లో 50.5, ఆత్మకూరులో 49.4, పానుగల్‌లో 36.2, వీపనగండ్లలో 31.3, పెద్దమందడిలో 25.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


చిల్వేరు గ్రామ శివారులోని యూటీ కాల్వ పక్కన పడిన గండి


గద్వాల జిల్లా బోయలగూడెం శివారులో నీట మునిగిన సీడు పత్తి పంటను చూపుతున్న రైతు

నేల వాలిన పంటలు

కొల్లాపూర్/తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో వర్షానికి పంటలు నీట మునిగాయి. కొల్లాపూర్ మండలంలోని రామాపురం, సోమశిల, చెన్నంపల్లి శివారుల్లో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట నేలవాలింది. మిరప, కంది, మునగ పంటలు నీట మునిగాయి. దాదాపు 200 ఎకరాలకు పైగా పంటలు రైతులు నష్టపోయారు. 60.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రామాపురంలో రైతు కురుమయ్య మూడెకరాల ఆయిల్ పామ్ తోటలో సాగు చేసిన మొక్కజొన్న పంట నీటిపాలైంది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ ఏడీ రవి పరిశీలించారు. తాడూరు మండలంలోనూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. తిమ్మాజిపేట మండలంలో భారీ వర్షం కురిసింది. దాంతో తాడూరు మండలంలోని ఐతోల్ వద్ద నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై గల లోలెవల్ కాజ్ నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ వర్షంతో పత్తి, మొక్కజొన్న పంటలకు మేలు చేకూరింది. మండలంలో 20 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కబ్జాదారులను హడలెత్తిస్తున్న హైడ్రా

» కేసరి సముద్రం ఆక్రమణదారుల్లో గుబులు
» అధికార పార్టీలో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు


కేసరి సముద్రం పరిధిలో నిర్మించిన విలాసవంతమైన భవనం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాజధానిలో సాగునీటి వనరులను ఆక్రమించిన వారిపై హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కొరడా ఝుళిపిస్తుండటంతో నాగర్‌కర్నూల్ కేసరి సముద్రాన్ని ఆక్రమించిన కబ్జాదారుల్లోనూ కలవరం మొదలైంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం నేపథ్యంలో ఆక్రమించిన ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములకు ముప్పుతప్పదని భావిస్తున్న ఆక్రమణదారులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకునేది లేదని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తేల్చి చెప్పారు. దాంతో కబ్జాదారులకు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడిందని చర్చ జరుగుతోంది. నాగర్‌కర్నూల్ నుంచి డిండి వరకు 1,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే కేసరి సముద్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ఉంది. ఇక్కడి భూమికి బాగా డిమాండ్ రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. ఎఫ్‌టీఎల్ జోన్ పరిధిలో కొంత భూమిని కొనుగోలు చేసి, దానికి ఆనుకొని ఉన్న కేసరి సముద్రం చెరువు భూమిని ఆక్రమించారు. ఈ అంశం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరకు వెళ్లడంతో చెరువు భూ భాగాన్ని మొత్తం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. మొత్తం 31 చోట్ల ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని నివేదిక అందించారు. అందులో కొన్ని విలాసవంతమైన భవనాలు ఉన్నట్లు నివేదికలో రూపొందించారు. వీటిని తక్షణమే తొలగించి బయోఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినా.. రెవెన్యూ అధికారులు సరైన విధంగా స్పందించలేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన జిల్లా పరిషత్ భవన సముదయాన్ని తొలగించి చేతులు దులుపుకొన్నారు. రాజకీయ ఒత్తిడి కారణంగానే కేసరి సముద్రం కబ్జాను తొలగించలేకపోయారని అధికారులపై అపవాదు ఉంది.

ససేమిరా అంటున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

కేసరి సముద్రం చెరువును కబ్జా చేసిన అక్రమార్కులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్, మరో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉన్నారు. కుంటలు, మాణ్యం భూముల్లో కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసినట్లు వీరిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పదేళ్ల కాలంలో రియల్ ఎస్టేట్ దందాను స్థాపించిన ఇద్దరు.. కౌలుదారుల భూములు సైతం దర్జాగా అమ్మకానికి పెట్టారు. వీరు కాంగ్రెస్‌లో చేరడానికి మధ్యవర్తులను ఆశ్రయించగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అంగీకారం తెలుపలేదని సమాచారం. మూడున్నర దశాబ్దాల రాజకీయాల్లో మచ్చ అంటకుండా చూసుకుంటున్నామని, కబ్జాదారులను పార్టీలోకి రానిచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం.

నేడు పిల్లలమర్రి సందర్శన పునఃప్రారంభం

» 2018 తర్వాత సందర్శకులకు అనుమతి

మహబూబ్‌నగర్, ఆగస్టు 20: ఆరేళ్లుగా పర్యాటకుల సందర్శనకు నోచుకోని మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రిని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం పునఃప్రారంభించనున్నారు. చెద కారణంగా 2018లో చెట్టు రెండు భారీ ఊడలు నేలకొరిగాయి. దాంతో మహావృక్షం అంతరించిపోతుందని అంతా భావించారు. ఆ తరుణంలో అటవీశాఖ అధికారులు సెలైన్ ట్రీట్‌మెంట్ ద్వారా చెదను నివారించి, వృక్షానికి పునరుజ్జీవం పోశారు. ప్రస్తుతం చెట్టు పచ్చగా కళకళలాడుతోంది.. ట్రీట్‌మెంట్ కారణంగా సందర్శకులను ఇన్నాళ్లూ నిలిపేశారు. ఇప్పుడు పార్క్‌ను మళ్లీ ప్రారంభించి, సందర్శకులను అనుమతించనున్నారు. ఉదయం 8:45 గంటలకు మంత్రి పార్క్‌ను ప్రారంభించనున్నారు. 9:15 గంటలకు మయూరి ఎకోపార్క్ హిల్ పాయింట్‌లోని ఎకో టూరిజం సఫారిని సందర్శిస్తారు. అనంతరం 11:15 గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న త్రీస్టార్ హోటల్‌పై సమీక్ష చేయనున్నారు. 11:45 గంటలకు శిల్పారామాన్ని సందర్శించి, మధ్యాహ్నం 12:15 గంటలకు సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో సమీక్ష చేస్తారు.

పరీక్షల నిర్వహణ ఫీజు చెల్లించాలి : డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 20 : ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్వహించే పరీక్షల ప్రశ్న పత్రాల నిర్వహణ కోసం అన్ని పాఠశాలల యాజమాన్యాలు నిర్దేశించిన ఫీజులను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగానికి చెల్లించాలని డీఈవో రవీందర్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, జూనియర్ కళాశాల కరస్పాండెండ్లతో సమావేశం ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ అధ్యతన జరిగింది. ఈ సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యుడైస్ ప్లేస్‌లో స్టూడెంట్స్ పర్ అటెండెన్స్ ప్రకారం టీచర్స్ డేటా కూడా ఆన్‌లైన్‌లో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీ పిల్లవాడికి పిన్ నెంబర్ ఇవ్వాలన్నారు. తప్పని సరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. టీచర్స్ ఐడీ కూడా తప్పని సరిగా ఉండాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల విషయంలో పాఠశాల వారీగా ఐదు నామినేషన్లు ఈ నెల 25 లోపు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, డీసీసీబీ కార్యదర్శి వెంకట్‌రాములు, సైన్స్‌ఫోరం అధికారి శ్రీనివాసులు, ఏఎస్‌వో సంపత్, ఏపీవో అశోక్ పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక అవసరాల పిల్లలకు శిబిరం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 20 : తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్, భారత కృత్రిమ అవయవాల ఉపకరణాల సంస్థ, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష మందిరంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఈవో ఎ.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పాల్గొని పిల్లలు, తల్లిదండ్రులు, తప్పని సరిగా ఆధార్‌కార్డు, జిరాక్స్ , సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆదాయం సర్టిఫికెట్లు, ఐడీకార్డు, అంగవైకల్యం కనిపించేలా రెండు ఫోటోలు తీసుకొని క్యాంపు కార్యాలయానికి రావాలని సూచించారు.

మహిళలకు ఏ సమస్య వచ్చినా షీటీం నంబర్ 8712659365 ఫోన్ చేయండి

- ఎస్పీ డి. జానకి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 20 : మహిళలు, విద్యార్థినులకు ఏ సమస్య వచ్చినా 100 నంబర్‌కు గానీ, షీ టీం నంబర్ 8712659365 ఫోన్ చేయాలని ఎస్పీ డి. జానకి సూచించారు. మంగళవారం ఎదిర పరిధిలోని తిరుమల హిల్స్‌లో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా ద్వారా వేధింపులు, మహిళల అక్రమ రవాణా వంటి ఏ సమస్యలు ఉన్నా షీ టీం అందుబాటులో ఉంటుందని, ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే అక్కడికి వాలిపోయి మీ సమస్యను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడకుండా స్నేహపూరిత వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, అలాచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ర్యాగింగ్‌ల ౼ంటి కేసుల్లో ఇరుక్కొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అదేవిధంగా ఫ్రెషర్స్‌తో సరదాగా ఉండాలని, ర్యాగింగ్ భూతానికి బలికావద్దని అన్నారు. తప్పులు చేసే ముందు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుకు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇంచార్జి ఉమెన్ పీఎస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ దేవత బోనాలు

జడ్చర్ల, ఆగస్టు 20 : జడ్చర్ల మునిసిపాలిటీలోని 9వ వార్డులో పోచమ్మ దేవత బోనాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి వచ్చి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుమ్మరిరాజు, కరాటేశ్రీను, కృష్ణారెడ్డి, పర్వేది, భక్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల, ఆగస్టు 20 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని, ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ నెల 17న భర్త భార్యను హైదరాబాద్‌లో ఉండే కుమార్తె వద్దకు వెళ్లేందుకు బస్సు ఎక్కించాడు. రాత్రి 9గంటలకు వరకు కుమార్తె ఇంటికి చేరుకోకపోవడంతో పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద వాకబు చేశాడని, ఆచూకీ దొరకకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేసాడని సీఐ వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

జడ్చర్ల, ఆగస్టు 20 : జడ్చర్ల మునిసిపాలిటీ రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన బద్రున్నీసా(57) మంగళవారం జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి శ్మశానవాటిక సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా మానసిక ఆవేదనకు గురైన ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

జడ్చర్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల, ఆగస్టు 20 : జడ్చర్ల క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్స్‌దుకాణానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(30) మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. రెండు రోజులుగా అదే ప్రాంతంలో మద్యం తాగి తిరుగుతున్నాడని, మంగళవారం మద్యం మత్తులో రోడ్డు డివైడర్ పక్కన పడిపోయాడని, అక్కడే మృతిచెందాడని స్థానికులు తెలిపారు. ఈ అంశంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా సదరు వ్యక్తి పెబ్బేరు పట్టణానికి చెందిన వ్యక్తిగా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

పాము కాటుతో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

గండీడ్, ఆగస్టు 20 : నిద్రలో ఉండగా భార్యాభర్తలకు పాము కాటు వేసిన సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బండకాడి రామయ్య, ఎల్లమ్మ భార్యాభర్తలు. తమ ఇంటిలో నిద్రపోతుండగా పాము ఇద్దరిని కాటు వేసింది. గుర్తించిన కుటుంబీకులు, గ్రామస్థుల సహాయంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భర్త రామయ్యకు విషమంగా ఉందని, భార్య ఎల్లమ్మ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఇంటి దగ్గర పాతబడిన ఇంటి గోడలు ఉండడమే పాము కాటుకు కారణమై ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. గతంలో కూడా వీరి కోడలికి కూడ పాము కాటు వేయగా, చికిత్స అనంతరం బతికి బయటపడిందని గ్రామస్థులు తెలిపారు.

మితాహారపు అలవాట్లు ఎంతో అవసరం

భూత్పూర్, ఆగస్టు 20 : ప్రతీ మనిషి ప్రస్తుత సమాజంలో తన జీవన శైలిని మార్చుకున్నట్లతే మంచి ఆరోగ్యవంతులుగా జీవిస్తారని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ ఆయూష్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రతీ మనిసి చాలా బీజీ జీవనాన్ని గడుపుతున్నాడని, అదే విధంగా ఆహారపు అలవాట్లు అదుపు తప్పిపోయి రోగాలు వస్తున్నాయని అన్నారు. ప్రతీ రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, వంటివి చేయాలన్నారు. అంతకుముందు ఈ శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండల యూనాని వైద్యుడు జహీరొద్దీన్, మండల వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్, ఫార్మాసిస్టులు రవి, సుమిత్ర, సబీర్, రోగులు, తదితరులు పాల్గొన్నారు.

మూతబడి తెరుచుకునేనా ?

- పాఠశాలలను తెరిపించాలన్న సీఎం ఆదేశాలు బుట్టదాఖలేనా?
- మహబూబ్‌నగర్‌లో మూతపడ్డ 48 పాఠశాలలు
- చర్యలు చేపట్టని విద్యాశాఖ



మహమ్మదాబాద్ మండలంలోని బోరింగ్ తండా పాథమిక పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 20 : 'ప్రాథమిక విద్య ప్రతీ చిన్నారికి అందించాలి. ప్రతీ గ్రామం, ప్రతీ తండా, ఇతర ఆవాసాలలో ఒక్క పాఠశాల కూడా మూత పడొద్దు. మూతపడ్డ పాఠశాలలను తెరిపించి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి. పాఠశాలకు టీచర్లను కూడా కేటాయించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటలను విద్యాశాఖ అధికారుల అమలు చేయడంలేదు. పాఠశాలను తప్పనిసరిగా విద్యా సంవత్సరం ఆరంభం నుంచే తెరిపించాలని, ఆ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కూడా నియమించాలని విద్యాశాఖ అధికారులకు సీఎం సూచించారు. పాలమూరు జిల్లాలో మూతపడ్డ పాఠశాలలు 48 ఉన్నా ఇప్పటికీ అవి మాత్రం తెరుచుకోలేదు. జిల్లాలో 614 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 566 మాత్రమే పని చేస్తున్నాయి. మిగతా 48 పాఠశాలలు మూతపడ్డాయి. ఇందులో అత్యధికంగా గిరిజన తండాలు బోయగుడిసెలు, మారుమూల గ్రామాల్లోనే ఉన్నాయి. ఉపాధ్యాయులు లేక పాఠశాల మూతపడటంతో విద్యార్థులు బడి మానేస్తున్నారు. బడి బయటి పిల్లలుగా మిగిలిపోతున్నారు. పాఠశాల భవనాలు మాత్రం పశుపాకలకు, రైతులు ధాన్యం పోసుకునేందుకు, యాచకులు ఉండేందుకు నివాసాలుగా మారాయి.

జిల్లాలో పరిస్థితి ఇలా :

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 17 మండలాల్లో 614 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, ఇందులో 566 ప్రాథమిక పాఠశాలలు కొనసాగుతున్నాయి. 48 పాఠశాలలు మూతపడ్డాయి. అత్యధికంగా గండీడ్ మండలంలో 10 పాఠశాలలు ఉన్నాయి. బాలానగర్ మండలంలో తొమ్మిది, జడ్చర్ల మండలంలో ఏడు, మహమ్మదాబాద్ మండలలో ఆరు, మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో రెండు, చిన్నచింతకుంటలో మండలంలో రెండు, కోయిలకొండ మండలంలో రెండు, నవాబ్‌పేటలో రెండు, రాజాపూర్‌లో రెండు, మిడ్జిల్‌లో రెండు, భూత్పూర్‌లో రెండు, మూసాపేట మండలంలో ఒకటి, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఒకటి చొప్పున పాఠశాలలు ఉన్నాయి.

చర్యలు చేపట్టని విద్యాశాఖ అధికారులు

మూతపడ్డ పాఠశాలలను తెరిపించాలని ఆదేశాలు ఉన్నా మూతపడ్డ ఒక్క పాఠశాలను కూడా తెరిపించలేదు. కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు అటు వైపు చూసిన దాఖలాలు కూడా లేవు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని బోరింగ్‌తండాలో రెండు పాఠశాలల తరగతి భవనాలు నిర్వహించారు. అక్కడ ఆరేళ్లుగా పాఠశాల మూతపడి ఉంది. ఇప్పుడు అది పశువుల పాకగా మారింది. గండీడ్ మండల పరిధిలోని పలు తండాలలో ఇదే పరిస్థితి ఉంది. జడ్చర్ల, బాలానగర్ తదితర మండలాల్లో కనీసం పాఠశాల భవనాలను కాపడేందుకు ముందుకురావడంలేదు.

పాఠశాలను తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మూతపడ్డ పాఠశాలను తెరిచేందేకు చర్యలు తీసుకుంటున్నాం. ఆ పాఠశాల పరిధిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో వారిని గుర్తించే పనిలో ఉన్నాం. ఆ పాఠశాలకు ఉపాధ్యాయులను కూడా కేటాయిస్తాం. త్వరలో తెరుచుకునే విధంగా చర్యలు తీసుకుంటాం .

- ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

బీఆర్‌ఎస్ నాయకులది పైశాచిక ఆనందం

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

పెబ్బేరు, ఆగస్టు 20: బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు పైశాచిక ఆనందం పొందుతున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి విమర్శించారు. మంగళవారం సాయంత్రం పెబ్బేరులో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు రాచరికపు పాలనకు స్వస్తి పలికి ప్రజా పాలనకు పట్టం కట్టారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయవంతంగా సాగుతోందన్నారు. దీన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిందలు వేస్తూ పైశాచికానందం పొందుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. ఇప్పటి వరకు 17వేల కోట్లకు పైగా రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. మిగితా డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని రెండు లక్షలకు పైగా ఉన్న వారు పైనఉన్న అమౌంట్ చెల్లిస్తే రెండు లక్షలు మాఫీ అవుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. వాటిని సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామిలన్నింటిని అమలు చేస్తుందన్నారు. 10 సంవత్సరాల కేసీఆర్ రాజరిక పాలనకు ప్రజలు అంతం పలికారని రేవంత్‌రెడ్డి ప్రజా పాలనకు ప్రజలు ఆమోదం లభించిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతో లాలుచీ పడడంతో గుండు సున్నా వచ్చిందన్నారు. దీంతో బీఆర్‌ఎస్ అస్తిత్వం కోల్పోయి కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసిపోతుందని నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్, బీజేపీ రైలు పట్టాల వంటివని, అవి ఎప్పటికి కలువని, ఎప్పుడు కాంగ్రెస్ బీజేపీకే పోటీ ఉంటుందని తెలిపారు. త్వరలో తెలంగాణలోని ప్రతీ మండలంలో నాలుగో తరగతి నుంచి పీజీ వరకు ఇంటిగ్రేటెడ్ సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుందని, అలాంటిది గతంలో ఎప్పుడైనా ఇలా చేశారా అని ఆయన విమర్శించారు. పెబ్బేరు వేణుగోపాలస్వామి ఆలయ పూజారులు మాయమాటలు నమ్మవద్దన్నారు. 40 సంవత్సరాలుగా పెబ్బేరులో జరిగే సంత వల్ల వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, సంత జరిగే స్థలం ఎప్పటికి అక్కడే జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో పూజారులను తప్పు పట్టాల్సిన అవసరం లేదని, వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించి పెబ్బేరులో యథావిధిగా సంత జరిగేలా చూస్తామని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచు అక్కి సుశీల, మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, అక్కమ్మ, సత్యం నాయుడు, షకీల్, యుగందర్ రెడ్డి, రాములు, శివసాయి పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో ఆర్కియాలజీ అధికారులు



అలంపూర్‌లో ఆర్కియాలజీ అధికారులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్, ఆగస్టు 20: ఐదవ శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామివార్లను మంగళవారం ఆర్కియాలజీ ప్రొఫెసర్ మహలక్ష్మీ బృందం దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ ఈవో పురందర్‌కుమార్, అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో గణపతి పూజ, స్వర్శదర్శనం, అభిషేకం, అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఏడవ శతాబ్దం నాటి అలంపూర్ నవబ్రహ్మ ఆలయాల్లో ఆర్కిటెక్చర్, శాసనాలు, సంప్రదాయాలపై అధ్యయనం చేయడం మా పరిశోధనలో అలంపూర్ ఆలయాలు సంతృప్తిని ఇచ్చాయని బృందం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, జోగుళాంబ ఆలయ సేవాసమితి అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

రాఖీ పండుగకు ఆర్టీసీకి ఆదాయం



బస్టాండ్‌లో పర్యవేక్షిస్తున్న ఆర్.ఎం.శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 20 : రాఖీ పర్వదినం సందర్భంగా ఆర్టీసీకి రీజియన్‌లో ఒక్క రోజులోనే రూ.2కోట్ల 88 లక్షల ఆదాయం వచ్చింది. గత సంవత్సరం రాఖీ పర్వదినం రోజు కోటీ 99లక్షల ఆదాయం వచ్చింది. ఆ ఒక్క రోజు 3లక్షల 71 వేల కిలోమీటర్లు తిప్పి 5లక్షల 84 మంది ప్రయాణికులను క్షేమంగా వారి వారి గమ్య స్థానాలకు చేర్చినట్లు ఆర్.ఎం. శ్రీదేవి తెలిపారు. ఒక్కరోజు రాబడిలో రీజియన్ సరికొత్త రికార్డు నెలకొల్పిందని తెలిపారు. 2 లక్షల 4వేల మంది ప్రయాణికులు అదనంగా రాకపోకలు సాగించారని, ఒక్కరోజులో ఇంత పెద్ద ఎత్తున ప్రయాణికులు ప్రయాణించడం ఇదే తొలిసారని తెలిపారు. అచ్చంపేట డిపో పరిధిలో రూ. 28.20లక్షల ఆదాయం, గద్వాల డిపోలో రూ.34.14లక్షలు, కల్వకుర్తి రూ.35.82 లక్షలు, కొల్లాపూర్ రూ.22.32 లక్షలు, కోస్గి రూ.3.52లక్షలు, మహబూబ్‌నగర్ రూ.42.61లక్షలు, నాగర్‌కర్నూల్ రూ.28.01లక్షలు, నారాయణపేట రూ.28.13లక్షలు, షాద్‌నగర్ రూ.28.14లక్షలు, వనపర్తి రూ.37.46లక్షలు రాబడి గడించాయని తెలిపారు. టీజీఎస్‌ఆర్టీసీ కార్పొరేషన్‌లోనే మహబూబ్‌నగర్ రీజియన్ ఆక్యుపెన్సి రేషియో 131 శాతం నమోదు చేసి ఆల్ టైం రికార్డు నెలకొల్పిందన్నారు. ఈ ఘనత సాధించేందుకు కండక్టర్, డ్రైవర్ల కృషి ఎంతో ఉందని ఆర్ఎం ఆమె కొనియాడారు. ప్రయాణికులందరికి రాఖీ పర్వదినం, శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఎల్లప్పుడూ ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

మొక్కలు పెంచే బాధ్యత తీసుకున్న విద్యార్థులు



ఆలూరు జడ్పీహెచ్ఎస్‌లో రాఖీలు కట్టి మొక్కలు పెంచే బాధ్యత తీసుకుంటున్న విద్యార్థులు

జడ్చర్ల, ఆగస్టు 20 : మండలంలోని ఆలూరు జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలకు రాఖీలు కట్టి, వాటిని పెంచే బాధ్యతను విద్యార్థులు తీసుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకుని, ఒకరికి మరొకరు రక్షా అంటూ చెప్పుకుంటారు. అందుకు భిన్నంగా మొక్కలకు రాఖీలు కట్టి, వాటిని పెంచే బాధ్యతను తీసుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- చికిత్సకు తరలించిన ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, ఆగస్టు 20 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలవగా అదే రోడ్డు మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గమనించి చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని బల్సుపల్లి గ్రామానికి చెందిన హన్మంతు అనే వ్యక్తి తన బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా దేవరకద్ర చెరువు దగ్గర ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై కింద పడిపోయాడు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే గమనించి ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

మరికల్ రైతు వేదికలో కంప్యూటర్ మానిటర్ అపహరణ

నవాబ్‌పేట, ఆగస్టు 20: వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ రైతువేదికలో ఉన్న విలువైన కంప్యూటర్ సామగ్రి అపహరించినట్లు ఏఈవో బుక్కరాజు భావన మంగళవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం గ్రామంలో రైతుల అవసారార్థం కొంత కాలం క్రితం ప్రభుత్వం రైతువేదికలో కంప్యూటర్ మానిటర్ ఇతర విలువైన సామగ్రిని ఏర్పాటు చేసింది. గుర్తు తెలియని దుండగులు అక్కడ ఎవరూ లేని సమయంలో ఈ సామగ్రిని అపహరించినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం తాళం వేసి వెళ్లిపోగ మంగళవారం ఉదయం గ్రామస్థుల సూచన మేరకు ఏఈవో భావన అక్కడకు వెళ్లి చూడగా పలు వస్తువులు ధ్వంసం కావడంతో పాటు విలువైన సామగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించి ఉన్నతాధికారుల సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

నగల కోసం హత్య

- కల్లుతాపి గాఢనిద్రలోకి వెళ్లాక రోకలి బండతో దాడి
- తులం బంగారు, 30 తులాల వెండి నగలు అపహరణ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 20 : డబ్బు అవసరం ఓ హత్యకు దారితీసింది. ఒంటిపై ఉన్న నగలను అపహరించాలని పథకం ప్రకారం కల్లు తాపి గాఢనిద్రలోకి వెళ్లాక హత్యచేసి నగలు దోచుకెళ్లిన మహిళను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... నవాబ్‌పేట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన పురుగుల లక్ష్మమ్మ(48) ఈనెల 12న హత్యకు గురైంది. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు హత్యకేసును ఛేదించారు. లక్ష్మమ్మ భర్త చనిపోగా కొడుకు కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఒంటరి మహిళ పద్మ లక్ష్మమ్మతో స్నేహంగా ఉండేది. పద్మకు డబ్బులు అవసరం పడ్డాయి. డబ్బుల కోసం లక్ష్మమ్మను హత్యచేసి నగలు కాజేయాలని పథకం వేసింది. ఈనెల 12న సాయంత్రం పద్మ 4 ప్యాకెట్లలో కల్లు తీసుకుని లక్ష్మమ్మ ఇంటికెళ్లింది. లక్ష్మమ్మకు అధిక మోతాదులో కల్లుతాపించి, ఇద్దరూ అక్కడే పడుకున్నారు. అర్ధరాత్రి లక్ష్మమ్మ గాడనిద్రలో ఉండగా పద్మ ఇంట్లో ఉన్న రోకలిబండ తీసుకుని లక్ష్మమ్మ తలపై బలంగా మోది హత్య చేసింది. ఆమె ఒంటిపై ఉన్న తులం బంగారం, 30 తులాల వెండి నగలు, మృతురాలి సెల్‌ఫోన్ అపహరించి తలుపులు దగ్గరికేసి వెళ్లిపోయింది. మరునాడు కొడుకు కానిస్టేబుల్ తల్లికి ఫోన్ చేయగా అమె ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటి వాళ్లకు ఫోన్ చేసి ఇంటికెళ్లి చూడాలని కోరగా, వాళ్లు వెళ్లిచూసే సరికి రకతపు మడుగులో చనిపోయి ఉన్న లక్ష్మమ్మను చూసి విషయం చెప్పడంతో అతను నవాబ్‌పేట పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో పడి ఉన్న నాలుగు కల్లు ప్యాకెట్ గుర్తించిన పోలీసులు కల్లు దుకాణం వద్ద వివరాలు సేకరించారు. దొంగిలించిన నగలలో ఓ నగను జడ్చర్లలో గుర్తు తెలియని వ్యక్తికి రూ.8 వేలకు విక్రయించింది. సెల్ ఫోన్‌లో సిమ్ తీసేసి పారేసింది. మూడ్రోజుల తరువాత మృతురాలి సెల్‌లో తన సిమ్ వేసుకుని పద్మ తన అల్లుడికి ఫోన్ చేయడంతో పోలీసులకు దొరికిపోయింది. దాని ఆధారంగా పద్మను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె నుంచి 26 తులాల వెండి 3 గ్రాముల బంగారు, రూ.23 వేల నగదు రికవరీ చేశారు. కేసు ఛేదించిన సీఐ గాంధీనాయక్, మహ్మదాబాద్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీకాంత్‌రావు, సర్కిల్ ఆఫీసు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, మహ్మదాబాద్ పీసీ రఘు, హన్వాడ పీసీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ పీసీ మహేందర్‌లను డీఎస్పీ అభినందించారు.

తప్పుల తడకగా ఉపాధి హామీ రికార్డులు

- సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 20: మండలంలో చేసిన ఉపాధి హామీ పనుల నమోదు రికార్డులు తప్పుల తడకగా ఉన్నాయని ఉపాధి హామీ పనుల తనిఖీ బృందం అధికారులు డీఆర్‌డీవో ఉమాదేవి అడిషనల్ డీఆర్‌డీవో నాగేంద్రం ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనుల ఆడిట్ ప్రత్యేక బృందం రికార్డులో జరిగిన తప్పులను అంశాల వారీగా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈజీఎస్ పనుల్లో భాగంగా పంట పొల్లాల్లోకి మట్టిని తరలించిన ట్రాక్టర్లకు కిరాయి డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని తెలిపారు. రికార్డులలో అసంపూర్తి సమాచారం నమోదు చేశారని గుర్తించారు. హరితహారంలో నాటిన మొక్కలను చాలా ప్రాంతాల్లో సంరక్షించలేకపోయారని తెలిపారు. కొంతమందికి పని చేయకపోయినా కూలి చెల్లించారని, మరి కొంతమందికి పని చేసినా డబ్బులు చెల్లించలేదని వివరాలతో సహా తెలిపారు. మస్టర్లలో సంతకాలు లేకుండా చెల్లింపులు చేశారని అన్నారు. ఆడిట్ బృందం జరిగిన తప్పులను అంశాలవారీగా క్షేత్రస్థాయిలో అధికారుల ముందు ఉంచారు. సామాజిక తనిఖీ సమావేశంలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారని డీఆర్‌డీవో ఉమాదేవి మండల అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, డీపీవో ఎండీ రహీం, పంచాయతీ రాజ్ డీఈ కబీర్‌దాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజు, ఏపీవోలు లక్ష్మి, సత్యనారాయణ, ఎస్ఆర్‌పి మహేష్, ఎస్‌టీఎం అజయ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 20 : ఓ మహిళ ముగ్గురు పిల్లలతో అదృశ్యమైంది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శోభ అనే మహిళ కుటుంబ కలహాలతో తన ఇద్దరు కుమారులు భాను, దత్తాత్రేయ, కుమార్తె హేమలతను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు వారి ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదు. దాంతో బాధితకుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

బంగారం ఆశచూపి టోకరా

- రూ. 12 లక్షలు మోసపోయిన రైతు



నకిలీ నగలతో మోసపోయిన రైతు బాల్‌రెడ్డి

నర్వ, ఆగస్టు 20 : నకిలీ బంగారం కొని ఓ రైతు మోసపోయిన ఘటన నారాయణ పేట జిల్లా నర్వ మండలంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం నాగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన రైతు బాల్ రెడ్డిని అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు, వెంకటేష్ అనే వ్యక్తులు మాయమాటలతో మభ్యపెట్టారు. ఏపీలోని అనంతపురంలో రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు కేవలం రూ. 12 లక్షలకే వస్తాయని ఆశ చూపారు. దీంతో రైతు తను కష్టార్జితంతో దాచుకున్న డబ్బుతో పాటు అప్పులు చేసి నెల రోజుల క్రితం ఒక్కసారిగా రూ. 12 లక్షల నగదు నకిలీ బంగారం విక్రయదారులకు అప్పజెప్పాడు. వారి నుంచి ధగధగ మెరుస్తున్న రెండున్నర కిలోల నకిలీ బంగారు హారాలను పెద్ద బాల్‌రెడ్డి జాగ్రత్తగా తెచ్చుకొని ఇంట్లో దాచుకున్నాడు. వారం రోజులు అయ్యాక వాటిని తెరిచి చూసి ఆ గొలుసులు నల్లబారడం గమనించి నగల వ్యాపారుల వద్దకు వెళ్లి పరిశీలించగా అవి నకిలీ బంగారంగా తేలింది. దీంతో రైతు గుండె గుబేలైంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయన వాటిని విక్రయించిన వ్యాపారులకు ఫోన్ చేయగా సెల్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దీంతో మధ్యవర్తులుగా ఉన్న వారి గ్రామస్థులతో పంచాయితీ నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు నర్వ ఎస్ఐ కుర్మయ్యకు 20 రోజుల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా, ఆ సంఘటన మన రాష్ట్రంలో జరగలేదని, ఎక్కడ జరిగిందో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 20: తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే లోకల్ బాడీస్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించుకునేందుకు సహకరించాలని సూచించారు. అక్టోబరు 18 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల పేర్లు నమోదు, మరణించిన లేదా షిఫ్ట్ అయిన ఓటర్ల పేర్లు తొలగింపు, మార్పు చేర్పుల నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో ప్రతి పార్టీ నుంచి ఒక బూత్ లెవెల్ ఏజెంట్‌ను నియమించి బీఎల్‌వోలు చేసే పనిని పర్యవేక్షణ చేస్తే జాబితా తప్పులు లేకుండా రూపొందించవచ్చన్నారు. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో ఉన్న 4,90,707 ఓటర్ల జాబితా పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు అందించామని, జాబితాలో ఉన్న తప్పొప్పులను చూసి తగు సిఫారసు చేయాలని తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయసు పూర్తి అవుతున్న వారు ఫారం 6 ద్వారా తమ పేరును ఎలక్టోరల్ జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2008 జనవరి 1 కంటే ముందు జన్మించిన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో పద్మావతి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్ నాయక్, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ నుంచి రాజేంద్రప్రసాద్ యాదవ్, వేణాచారి, సీపీఐ ఎండీ జబ్బార్, బీఆర్‌ఎస్ సయ్యద్ జమీల్, బీజేపీ కుమారస్వామి, ఎంఐఎం ఎండీ రహీం, లోక్‌సత్తా గంధం నాగరాజు, టీడీపీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా తీజ్ వేడుకలు



మన్ననూరులో మొలకల బుట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

మన్ననూర్, ఆగస్టు 20: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని ఉమామహేశ్వర తండాలో గిరిజనులు తీజ్ వేడుకలను మంగళవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఐదేళ్లకొకసారి మొలకల పండుగను గిరిజనులు నిర్వహించడం అనవాయితీగా వస్తుండడంతో ఈ యేడాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల క్రితం గోధుమలను బుట్టల్లో నానబెట్టి నీళ్లు పోసి పూజలు చేశారు. పెరిగిన మొలకల బుట్టలను గిరిజన మహిళలు, యువతులు తలపై పెట్టుకొని గ్రామ పురవీధుల గుండా డప్పువాయిద్యాలు, నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సీత్ల కుల దేవత వద్ద పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్థానిక దుర్వాసుల చెరువుల్లో మొలకలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గిరిజనులంతా సామూహిక భోజనాలు చేశారు. మొలకల పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉండే బంధువులంతా ఒక చోట చేరి సంబురాల్లో పాల్గొడం స్థానిక గిరిజన తండా సందడిగా మారింది. కార్యక్రమంలో గ్రామ బంజారా సంఘం పెద్దమనిషి(నాయకుడు) రామారావు, మాజీ సర్పంచి శ్రీరాంనాయక్, గిరిజన నాయకులు లాల్‌సింగ్, తుల్స్యా, చంద్రూనాయక్, మల్యానాయక్, హరియా నాయక్, లోక్య, గోపాల్, లక్య, హరి, లక్ష్మణ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కృష్ణ, ఆగష్టు 20 : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఐనాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రామలింగమ్మకు నాలుగు సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా కరేకల్‌కు చెందిన జగదీష్(24)తో వివాహం జరిగింది. పెళ్లైన నాటి నుంచి భార్యభర్తలు ఇద్దరు ఐనాపూర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో జగదీశ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు సంతానం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నవీద్ మంగళవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోస్గి, ఆగస్టు 20 : లారీని వెనక నుంచి ద్విచక్ర వాహనంతో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం కోస్గిలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం కుదురుమళ్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య (50) అదే గ్రామానికి చెందిన రాంచందర్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై కోస్గికి వస్తున్నారు. కోస్గి శివారులోని బస్‌డిపో సమీపంలో వేగంగా వచ్చి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందగా, రాంచందర్‌కు గాయపడ్డాడు. తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

భూవివాదంలో ఒకరిపై కేసు నమోదు

ఉప్పునుంతల, ఆగస్టు 20: భూవివాదంలో ఒకరిపై కేసు నమోదు అయినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని గుండమోని పర్వతాలు, సుధాకర్ అన్నదమ్ముళ్లు. వీరి మధ్య కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. అదే క్రమంలో మంగళవారం మాట్లాడుకుందామని తమ్ముడు సుధాకర్ వద్దకు అన్న పర్వతాలు వెళ్లాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. అన్నను తమ్ముడు సుధాకర్ కట్టెతో కొట్టి గాయపరిచాడు. పర్వతాలు ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోద చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కోయిలకొండ చౌరస్తాలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

కోయిలకొండ, ఆగస్టు 20 : నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వివేకానంద చౌరస్తాలో కేక్‌కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణపేట సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, రాజునాయక్, రవినాయక్, శేఖర్, రామస్వామి, రాములుగౌడ్, సంపత్, నాగరాజు, గౌస్, మనోజ్, బాలరాజుగౌడ్, సత్యం, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను రెగ్యులరైజ్ చేసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్, ఆగస్టు 20 : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కోసం దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తెలిపారు. 2020వ సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎంతోమంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, స్థానిక సంస్థలు సంయుక్తంగా సర్వే చేస్తున్నాయని తెలిపారు. అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు గతంలో దరఖాస్తుదారులు ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేస్తారని, దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేసిన అన్ని వివరాలు సరైనవే అయితే క్రమబద్ధీకరణ చేస్తారన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని పక్షంలో ఆన్‌లైన్‌లో వాటిని పొంది సర్వేకు వచ్చిన అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు సర్వే బృందాలకు సహకరించి వారి లేఅవుట్లను రెగ్యులర్ చేసుకోవాలని కోరారు. సందేహాల కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 08542-241165 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

● భూత్పూర్ : ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను, స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం భూత్పూర్ మునిసిపాలిటీశాఖ అధికారులు చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ స్థలాలను ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపాలిటీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టిన పరిశీలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మునిసిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు 5,999మంది దరఖాస్తు చేసుకున్నారని కమిషనర్ సురేందర్‌రెడ్డి అదనపు కలెక్టర్‌కు వివరించారు. రెవెన్యూశాఖ అధికారులు వెంకటేష్, భానుచందర్, ఇరిగేషన్ శాఖ, మునిసిపాలిటీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆగని ఆందోళన



జనరల్ ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యవిద్యార్థులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఆగస్టు 20 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ఘటనలో నిందితుడికి శిక్ష పడాలని చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు జనరల్ ఆసుపత్రి ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకొని నిందితుడికి శిక్ష పడాలని నినాదాలు చేశారు. అనంతరం బ్యాండు మోగిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జనరల్ ఆసుపత్రి ఎదుట టెంట్ వేసుకొని బ్యాండు మోగిస్తూ నిరసన తెలపడం వలన ఆసుపత్రికి వచ్చే రోగులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఆసుపత్రి ఆవరణలో పాత గేటు వద్ద ధర్నా చేసుకోవాలని, రోగులకు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టుకోవాలని విద్యార్థులకు సూచించినట్లు ఆయన వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే సమ్మె



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలమూరు, ఆగస్టు 20 : గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే ఇవ్వకపోతే సమ్మె చేస్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, వెంకటేష్‌గౌడ్‌లు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డీపీవోకు ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడాదిపాటు వేతనాలు బకాయి ఉందని, ఈజీతాలు ఈనెల 26వ తేదీలోపు చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామన్నారు. డీఎల్‌పీఓ, డీపీఓలను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు.

అడ్డాకులతో మరువలేని అనుబంధం

- బదిలీపై వెళ్లిన ఏవో శ్రీనివాసులు

అడ్డాకుల, ఆగస్టు 20 : అందరితో కలివిడిగా ఉండి ఎక్కువ కాలం పని చేయడంతో అడ్డాకుల మండలంలో రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో అనుబంధం ఏర్పడిందని మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళుతున్న ఏవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అడ్డాకుల రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ రైతులు, సిబ్బంది, స్థానిక నాయకులతో సత్సంబంధాలు ఏర్పర్చుకొని మండలానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గణేశ్, భీమన్నయాదవ్, బీఆర్ఎస్ పెద్దమండడి మండల అధ్యక్షుడు వేణు, ప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రంగారెడ్డి, పద్మారెడ్డి, నూతన ఎంఏఓ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త నారాయణగురుకు ఘన నివాళి

జడ్చర్ల, ఆగస్టు 20 : అణగారిన ప్రజల జీవితాల్లో మార్పునకు నాంది పలికిన సంఘ సంస్కర్త నారాయణగురు జయంతిని మంగళవారం కులసంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జడ్చర్లలోని ఎంఈవో కార్యాలయ ఆవరణలోని నారాయణగురు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం, తిరువనంతపురం సమీపంలోని చంప చండీ అనే గ్రామంలో దళిత కుటుంబంలో 1856 ఆగస్టు 20న నారాయణగురు జన్మించారన్నారు. సమ సమాజ స్థాపన కోసం హరిజన, గిరిజనులను దేవాలయాల ప్రవేశం చేయించారన్నారు. ప్రజలలో మార్పు తీసుకువచ్చేవిధంగా ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింములు, లింగంపేట శేఖర్, విజయ్‌కుమార్, గోపాల్, బీంరాజ్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, రాములు, రాధాకృష్ణ, జానీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల ఏఈవోల బదిలీ

నవాబ్‌పేట, ఆగస్టు 20 : మండలంలోని వివిధ గ్రామాలకు ఏఈవోలు పలువురు బదిలీ అయినట్లు మండల వ్యవసాయ విస్తరణాధికారి కృష్ణకిశోర్ మంగళవారం తెలిపారు. నవాబ్‌పేట క్లస్టర్‌కు ఎం.ఆనంద్, రుద్రారం శంకరమ్మ, లింగంపల్లి నవతేజ, ఇప్పటూర్‌కు మణికంఠగౌడ్, కొల్లూర్‌కు మానసలను నియమించినట్లు ఆయన తెలిపారు. పై క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు వీరి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ విజయేందిర



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), ఆగస్టు 20 : జనవరి 1, 2025 ఆధారంగా చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2025పై మంగళవారం ఆమె కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఈ నెల 20 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి పరిశీలన కార్యక్రమం చేపట్టారని, 18 సంవత్సరాలు పైబడిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలో సవరణలు చేయడం వంటివి చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సైతం రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, కాంగ్రెస్ నుంచి ఎం.డి.ఇద్రిస్, బీజేపీ నుంచి రాజేందర్‌రెడ్డి, సీపీఐ నుంచి బాలకిషన్, సీపీఎం నుంచి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

24న కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై వర్క్‌షాప్

మహబూబ్ నగర్ (కలెక్టరేట్) : ఈ నెల 24న ఉదయం 11 గంటలకు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో భూరికార్డుల క్రమబద్ధీకరణ కోసంనూతనంగా (కొత్తగా) ప్రతిపాదిత ఆర్‌వోఆర్ చట్టం (రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టం)పై అవగాహన కోసం వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, భూమి విషయాలపై పని చేసే ఎన్‌జీవోలు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, ఈ విషయంపై ఆసక్తి కలిగిన వారందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు



ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

పాలమూరు, ఆగస్టు 20 : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను బ్రహ్మకుమారీస్ మహబూబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి బహెన్‌జీ జి.మహాదేవి, డి.కె సరళ, డి.కె రూపా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంఘం సభ్యులు శివకుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతం బాధితులకు చెక్కుల పంపిణీ

విద్యుదాఘాతంతో మరణించిన కుటుంబాల వారికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన పరిహారం చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పలువురికి చెక్కులు పంపిణీ చేశారు. జమిస్తాపూర్‌కు చెందిన శరత్‌కుమార్ కుటుంబానికి రూ.ఐదు లక్షలు, బర్రెలు చనిపోవటంతో యజమానులు ధర్మాపూర్‌కు చెందిన పర్వతాలుకు రూ.40వేలు, ఫతేపూర్ బాలయ్యకు రూ.40వేలు, మాన్‌పల్లి హుస్సేన్‌కు రూ. 40 వేలు, హన్వాడ లింగన్నపల్లి గొల్ల బాలయ్యకు రూ.14వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నరసింహారెడ్డి, ధర్మాపూర్ నరసింహారెడ్డి, ఏడీఈ మద్దిలేటి, ఏఈ షకీల్, బాధితులు పాల్గొన్నారు.

60 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్ : ఆరు గ్యారెంటీలను అమలుచేస్తూ ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన 60 మందికి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందర్‌రాజ్, నాయకులు మల్లు నర్సింహారెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- విద్యార్థులకు బూట్లు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



మాచారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 20 : ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా చదువుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు స్వంత నిధులతో సమకూర్చిన బూట్లను మంగళవారం మండలంలోని మాచారం, కోడ్గల్, గంగాపురంలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం విద్యార్థులకు అందచేశారు. విద్యార్థులకు ప్రతీ సంవత్సరం బూట్లు అందజేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మాచారంలో వాల్మీకి దేవాలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే : జడ్చర్ల మండలం మాచారం గ్రామంలో నూతనంగా నిర్మించి ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేందర్‌గౌడ్, అశోక్‌యాదవ్, సర్వరాజ్ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలి : ఎమ్మెల్యే

రాజాపూర్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి మీ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుచ్చర్‌కల్ గ్రామంలో రూ.10 లక్షలతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం తన స్వంత ఖర్చులతో పాఠశాలలోని విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరహరి, సత్యం, కృష్ణయ్య, గోనెల రమేష్, రమణ, యాదయ్య, చంద్రకాంత్, గోవర్ధన్‌రెడ్డి, నసీర్ బైగ్, నాయకులుపాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మునిసిపల్ కార్మికులు

జడ్చర్ల : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 5వ తేదీ నుంచి దశల వారీగా పోరాటం, నిరసన, ఆందోళన కార్యక్రమాలను చేపట్టామని, అయినా మునిసిపల్ కమిషనర్ రాజయ్య నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాడంటూ మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి మునిసిపల్ కార్మికులు తెలిపారు. సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి, దీప్లానాయక్, తెలుగు సత్తయ్యతో పాటు కార్మికులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని కలిశారు. మునిసిపల్ కార్మికుల డిమాండ్లను వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, మహేష్, కృష్ణ, విజయ్, సాగర్ ఉన్నారు.

రుణమాఫీ సందేహాల నివృత్తికి మండలానికో ప్రత్యేక అధికారి

పాలమూరు, ఆగస్టు 20 : తెలంగాణ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ రూ.రెండు లక్షల వరకు మాఫీ చేస్తోంది. అందులో నేటికి రుణమాఫీ కాని రైతులకు సందేహాలు నివృత్తిచేసి అర్హత సాధించేందుకు జిల్లాలోని మండలానికో ప్రత్యేకాధికారిని నియమించినట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు రైతులకు ప్రత్యేకాధికారిని కలిసి దరఖాస్తుతో పాటు అవసరమైన డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డు, రుణమాఫీ పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. మహబూబ్‌నగర్ రూరల్- కె.శృతి, అర్బన్- పి.శ్రీనివాస్, కోయిలకొండ-బి.రాంపాల్, హన్వాడ-ఎ.కిరణ్‌కుమార్, గండీడ్-జి.ఫణీష్, మహమ్మదాబాద్-జే.నరేందర్, జడ్చర్ల-జి.గోపినాథ్, బాలానగర్-ఎం.సుజాత, నవాబ్‌పేట-ఎం.కృష్ణకిశోర్, మిడ్జిల్-సిద్ధార్థ, రాజాపూర్-కె.ప్రదీప్‌కుమార్, దేవరకద్ర- ఎన్.రాజేందర్ అగర్వాల్, చిన్నచింతకుంట- యం.రాజేష్‌ఖన్న, భూత్పూర్-జి.మురళీధర్, అడ్డాకుల-సి.బ్యాలా, మూసాపేట-బి.అనిల్‌కుమార్, కౌకుంట్ల-యం.చంద్రికలను నియమించినట్లు వివరించారు.

మునిసిపల్ కార్మికులతో విచారించిన జడ్పీ సీఈవో



జడ్చర్ల మునిసిపల్ కార్యాలయంలో కార్మికులతో విచారణ చేపడుతున్న జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 20 : కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశాల మేరకు మంగళవారం జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయంలో మునిసిపల్ కార్మికులతో జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి విచారణ చేపట్టారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, కక్ష్యధోరణి అవలంబిస్తున్నాడంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు జడ్పీ సీఈవో వచ్చారని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల పట్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్య వ్యవహరిస్తున్న తీరును సీఈవోకు వివరించామని తెలిపారు. శానిటేషన్ కార్మికులకు ఒక పూట విధానం అమలు చేయాలని, కార్మికులపట్ల వేధింపులకు పాల్పడుతున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, 2012 నుంచి 2014 వరకు పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ కాలేదని, దీంతో మృతి చెందిన 22 మంది కార్మికుల కుటుంబాలు ఈపీఎఫ్ డబ్బులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించినట్లు వెంకటేశ్ తెలిపారు. యూనియన్ నాయకుడిని విధులలో నుంచి తొలగించనట్లు ప్రచారం చేసి కార్మికుల మధ్య తగాదాలు సృష్టిస్తున్నాడంటూ సీఈవో దృష్టికి తెచ్చినట్లు చెప్పారు.

యన్మనగండ్లలో టీబీ పరీక్షలు

నవాబ్‌పేట, ఆగస్టు 20 : మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో మంగళవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ జయశీల మాట్లాడుతూ 113 మందికి వైద్య పరీక్షలు, ఎక్స్‌రే, మరో 23 మందికి తెమడ పరీక్షలు, నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవినాష్, భావనిసింగ్, శ్రీనివాస్‌లు, సుష్మ, బాలరాజు, రాజు, క్రిష్ణ, మల్లేష్, కేజియా, ఆశ కార్యకర్తలు జయమ్మ, రాములమ్మ, నీలమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు అజరామరం

- ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్

- పాలమూరులో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ



మహబూబ్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 20 : రాజీవ్‌గాంధీ సేవలు అజరామరని, ఆయన హయాంలో సాంకేతిక విప్లవం వచ్చిందని మహబూబ్‌నగర్, దేవరకద్ర ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. దేశానికి చాలా క్లిష్టమైన పరిస్థితులలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. కంప్యూటర్ విద్య, సాంకేతిక పరిజ్ఞానం తీసుకురావడం వల్ల ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, ఏపీ మిథున్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, సిరాజ్‌ఖాద్రి, షబ్బీర్‌అహ్మద్, సీజే బెనహర్, బెక్కరి అనిత, రాధా అమర్, అమరేందర్‌రాజు, లక్ష్మణ్‌యాదవ్, పెద్దవిజయ్, ఖాజాపాషా పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

దేవరకద్ర : రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో రాజీవ్‌గాంధీ జయంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రాపటానికి పూలమాలువేసి నివాళ్లర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

అడ్డాకులలో..

అడ్డాకుల : మాజీ ప్రధాని, భార తరత్న రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

మిడ్జిల్ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, వెంకటయ్య ముదిరాజ్, వెంకటయ్యగౌడ్, అశోక్, లింగం, జహీర్, ఆదాం, బాలయ్య శివ, శ్రీను నాయక్, పర్వతాలు, రాజు, రవీందర్‌రెడ్డి, కృష్ణ, బీరప్ప ఉన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించారు

గండీడ్ : మండలంలోని వెన్నచేడ్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశం కోసం ప్రానాలు వదిలిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీ అని నాయకులు కొనియాడారు.



మిడ్జిల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు ఆశన్న, కొట్యానాయక్, గోపాల్, లక్ష్మారెడ్డి, చిన్నయ్య, రాములు, పులిందర్‌రెడ్డి, రాములుగౌడ్ పాల్గొన్నారు.

● హన్వాడ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా హన్వాడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా, మండల నాయకులు సుధాకర్, రాములు, ఎం.డి. కలీం, ఆంజనేయులు, పెంటయ్య, కృష్ణయ్య, షబ్బీర్ హుస్సేన్, యాదవరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, గంగాపురి, సత్యం, నర్సింములు పాల్గొన్నారు.

జడ్చర్లలో నివాళి

జడ్చర్ల : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మంగళవారం రాజాపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, యాదయ్య, నరహరి, గోనెల రమేష్, రమణ, గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, సత్యం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను బుధవారం జిల్లా స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసూరుల్లా హైదర్ మహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటలకు క్రీడాకారులు జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మిడ్జిల్, ఆగస్టు 20 : మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలోని 9వ వార్డులో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడంలేదని మంగళవారం ఎంపీడీవో గీతాంజలికి వినతి పత్రం అందజేసినట్లు గ్రామానికి చెందిన ఆర్. శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలుగా సక్రమంగా తాగునీరు రావడంలేదని గ్రామ అధికారులకు తెలియజేసిన ఫలితంలేదని పేర్కొన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకును తొలగించి నూతన ట్యాంకును మంజూరు చేయాలని ఈ సందర్భంగా శ్రీధర్ కోరారు.

'విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించాలి'

పాలమూరు, ఆగస్టు 20 : టీజీ ఎస్‌పీడీసీఎల్ సంస్థలో ఉద్యోగులకు చట్టబద్ధంగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ సెక్రెటరీ టి.గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టపరంగా పదోన్నతులు కల్పించాలని 21న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట నిరసన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పదోన్నతుల్లో రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఇన్ ప్రమోషన్‌ని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు సరైన పద్ధతిలో అమలు చేయలేటంలేదన్నారు. ఎస్సీ ఎస్టీ, మహిళా ఉద్యోగులకు చేస్తున్న నష్టానికి నిరసన చేపడుతున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (621/2014) ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. నిరసనలో విద్యుత్ ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యాంమనోహర్, కార్యదర్శి రమేష్, మేడి, కంపెనీ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, బీచుపల్లి హాజరవుతున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం

పాలమూరు, ఆగస్టు 20 : ఉమ్మడి జిల్లాలోని గ్రామ గ్రామాన, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంతో పాటు అన్ని చోట్ల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల, క్షీరాభిషేకం చేద్దామని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు తీర్పు ఇవ్వటం, రాష్ట్రాల్లో అమలుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలుపై ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు రుణమాఫీ కాలేదని భారీగా దరఖాస్తులు

మహమ్మదాబాద్, ఆగస్టు 20 : రైతురుణ మాఫీ కాలేని రైతులు భారీగా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో (రైతువేదిక) మహమ్మదాబాద్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలలో అధికసంఖ్యలో దరఖాస్తు చేసకుంటున్నారు. పలువురు రైతులు మీడియాతో మాట్లాడుతూ తమకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదని వాపోయారు. దీనిపై 'ఆంధ్ర జ్యోతి' మండల వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడగా మండలంలో మొత్తం 9165 మంది రైతులు ఉన్నారని, ఇందులో ఇప్పటి వరకు 3200 మందికి రుణమాఫీ అయ్యిందన్నారు. ఇంకాకొన్ని వివరాలు రావల్సిఉంద న్నారు. మొదటి విడతలో 1914 మంది కి, రెండవ విడతలో 949 మందికి, మూడో విడతలో 241 మందికి వచ్చిందన్నారు. రైతురుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు సేకరిసున్నట్లు తెలిపారు

● మండల వ్యవసాయ అధికారిగా నరేందర్ : మండల వ్యవసాయ అధికారిగా నరేందర్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. రాజాపూర్ మండల వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు గండీడ్ మండల వ్యవసాయ అధికారి ఈ మండలానికి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించే వారు.

నల్లకుంట అలుగు పరిశీలన

జడ్చర్ల, ఆగస్టు 20 : జడ్చర్ల మునిసిపాలిటీలోని నల్లకుంట చెరువు అలుగును మంగళవారం ఇరిగేషన్‌శాఖ ఈఈ కృష్ణమోహన్, డీఈఈలు కృష్ణ, శ్రీనివాసులు, ఏఈఈ మహేష్‌లు పరిశీలించారు. వర్షం పడితే వర్షం నీరంతా పట్టణంలోని నేతాజీ చౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డ వెళ్లే దారిలోని వెంకటరమణ టాకీస్ సమీపంలో ప్రధాన రహదారిపైకి వస్తున్న సంఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలిం చేందుకు వచ్చారు. మినీట్యాంక్ బండ్‌గా మారిన నల్లకుంట చెరువు, చెరువుకు నిర్మించిన అలుగు ఉపయోగం లేకుండా ఉండడాన్ని గమనించారు. పాతబజారు నుంచి గౌడ ఫంక్షన్ హాల్ మీదుగా, నల్లకుంటలో నూతనంగా నిర్మించిన మురుగు కాలువ ద్వారా వర్షం నీరు లోతట్టు ప్రాంతంలో ఉన్న మడుగులోకి పోవాల్సిన వర్షం నీరంతా ప్రధాన రహదారిపై నిలుస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన మురుగు కాలువను, అలాగే అదే ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మించిన ప్రహరీని తొలగిస్తామని ఇరిగేషన్‌శాఖ ఈఈ కృష్ణమోహన్ తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఎలాంటి నిర్మాణాలు జరప వద్దని సూచించారు. పరిశీలించిన అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తామని వారు తెలిపారు.



నల్లకుంట చెరువు అలుగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు